




## (గత సంచిక తరువాయి)

**బెజవాడ గోపాలరెడ్డిగారు** ఆదాయ, పౌరవ్యయాల శాఖామంత్రిగా ఉండేవారు. వారింట్లో తరచూ సాహితీ సమావేశాలు జరుగుతూ ఉండేవి. తెన్నేటి విశ్వనాధంగారికి సన్మానం, జొన్నలగడ్డ సత్యనారాయణగారి కృతి సమర్పణ – కంగుమనే గొంతుతో వారి ఉపన్యాసం గుర్తున్నాయి.

దక్షిణ భారత నటీనట సమాఖ్యని తలశిల రామచంద్రరావుగారు నడిపేవారు. కరోల్‌బాగ్‌లో వారిల్లు. ఆ యింటి మేడమీద బర్సాతీ అంటారు – అక్కడొకాయన అద్దెకి ఉండేవారు. ఆయన 'ఈనాడు' రామోజీరావుగారు. అయితే 'ఈనాడు' ఆనాడు లేదు – బహుశా వారి మనస్సులో ఎక్కడో ఎంబ్రియో దశలో ఉండి ఉండదేమో! మనిషి చాలా నెమ్మది. ప్రసన్నత, స్నేహభావం వారి మాటల్లో ద్యోతకమయేది. నిలకడయిన ఆలోచన, అవగాహన, క్లుప్తంగా మాట్లాడే స్వభావం. ఢిల్లీలో ఏదో ప్రకటనల వ్యాపార సంస్థలో పనిచేసేవారనుకుంటాను. భవిష్యత్తులో ఆయన చెయ్యబోయే యజ్ఞానికి ఒక సమగ్రమయిన ప్రణాళికేదో ఆయన మనస్సులో ఉండి ఉండాలి. దానికి అవసరమయిన అనుభవాన్ని కూడదీసుకుంటున్న రోజులవి. ఆ తర్వాత ఎప్పుడు కలిసినా ఆప్యాయంగా పలకరించేవారు. 'బాగున్నారా మారుతిరావుగారూ?' అంటు. వారి ఈనాడూ, ఈటీవీ, సితార, ఉషాకిరణ్ చిత్ర నిర్మాణం – అన్నిటా యితోధికంగా నేను పాలుపంచుకోవడం జరిగింది. ఆయన సాధించిన విజయం ఒక తరానికి మార్గదర్శకం.

దక్షిణ భారత నటీనట (దభానన) సమాఖ్యలో మోతే వేదకుమారి, అనసూయా శర్మ, న్యాపతి రాఘవేంద్రరావు – యిత్యాదులు సభ్యులు. ఓ సందర్భంలో (అదేమిటో గుర్తులేదు) 'దంత వేదాంతం' ప్రదర్శించాం. అందులో నేను జ్ఞానశ్రీ. సాయంకాలమయేసరికి కానాట్ సర్కస్‌లో ఇండియా కాఫీ హౌస్ దగ్గర నిలబడడం దినచర్య. రైల్వే ఉద్యోగం ముగించుకుని రెండుచేతుల్లో రెండు మొక్కజొన్న కండెలు పట్టుకుని సాహిత్య అకాడమీ పక్కనుంచి పురాణం వచ్చేవారు. ఇద్దరం జంతర్‌మంతర్, దుర్గాబాయమ్మగారి ఆఫీసు, ఆకాశవాణి భవన్. రిజర్వు బ్యాంక్ దాటి పార్లమెంట్ హవుస్

పక్కనుంచి ఐఫాక్స్ థియేటర్ మీదుగా కృషీ భవన్ లాన్స్ చేరేవాళ్ళం. కృషీభవన్‌లో రామచంద్రరావుగారి ఉద్యోగం. ఆ లాన్స్‌లో 'దంత వేదాంతం' రిహార్సల్స్. ఇది మా దైనందిన కార్యక్రమం. దభానన అధ్యక్షులు ఆకెళ్ళ అచ్యుతరామంగారు. ఆయన రైల్వే బోర్డులో ఫైనాన్సియల్ అడ్వయిజర్‌గా చేసేవారనుకుంటాను. ఆయన ఒక్కరికే కారుండేది. రిహార్సల్స్ అయాక ఆయన మమ్మల్నందరినీ మా యిళ్ళకి చేర్చేవారు. దంతవేదాంతం ప్రదర్శనకి బెజవాడ గోపాలరెడ్డిగారు ముఖ్య అతిథి. అటు తర్వాత వారితో సాన్నిహిత్యం వారి చివరి రోజుల వరకూ సాగింది. దాదాపు 30 సంవత్సరాల తర్వాత ఆకెళ్ళ అచ్యుతరామంగారి మేనల్లుడి పెద్దమ్మాయి నా రెండో కోడలయింది. ఆయన మరణం చాలా విచిత్రం. సంవత్సరాల తర్వాత మాట. సికింద్రాబాద్‌కి దూరంగా కొత్త ఇల్లు కట్టిస్తున్నారు. అక్కడికి వెళ్ళి చూసివస్తుండగా సరిగ్గా ట్యాంక్‌బండ్ మీద గుండె నొప్పి వచ్చింది. పర్యవసానం ఆయనకి అర్ధమై ఉంటుంది. ఎవరినీ సహాయం అడిగే అవకాశం, వ్యవధీలేదు కారుని తీసి ఎమర్జెన్సీ లైట్లు వేశారు. ఇంజన్ ఆపారు. కారు తలుపులు తెరిచి, స్టీరింగ్ మీద తలవుంచారు. అంతే. ఆ క్షణాన్నే కన్నుమూశారు.

తలుచుకుంటే యిప్పటికీ నవ్వొచ్చే సంఘటన ఒకటి గుర్తుంది. ఆనర్స్ పూర్తయింది. కనుక ఉద్యోగ ప్రయత్నాలు మొదలెట్టాను. ఢిల్లీలో స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ అనే జాతీయ సంస్థకి మేనేజింగ్ డైరెక్టర్ డి. శాండిల్యగారు. వీరు సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి అల్లుడు. ఎవరో చెప్పారు. వారు బ్రాహ్మణులంటే ఆదరిస్తారని. బొత్తిగా లోకజ్ఞానం చాలని వయస్సు. సరాసరి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారింటికి వెళ్ళాను. శాండిల్యగారు బయటికి వచ్చారు. నేను ఆంధ్రదేశం నుంచి వచ్చానని, తెలుగువాడినని, ఉద్యోగంకావాలని, బ్రాహ్మణుడినని సూటిగా చెప్పాను. ఆయన ఫక్కున నవ్వేశారు. కానాట్ సర్కస్‌లో ఉన్న ఆఫీసుకి వచ్చి దరఖాస్తు పెట్టమన్నారు. నా అర్హతల్లో కొట్టొచ్చినట్టు బీయస్సీ ఆనర్స్ కనిపించేది కాని అది మేడిపండేనని నాతో రెండు నిమిషాలు మాట్లాడితే అర్ధమయిపోయేది. చదువుకు సంబంధించిన ఏ విషయాలూ నా మనస్సులో లేవు. ఒకటి రెండు ఇంటర్వ్యూలకు వెళ్ళాను. రెండు ఇంగ్లీషు వాక్యాలు కూడా మాట్లాడలేనంతటి దుస్థితిలో ఉంది నా పరిస్థితి. ఇంటర్వ్యూ చేసే కమిటీ ఛైర్మన్ శాండిల్యగారే. నా చేత రెండు ఇంగ్లీషు వాక్యాలు – తప్పుల్లేకుండా మాట్లాడించాలని ఎంతో ప్రయత్నించారు. విశాఖపట్నం నుంచి ఢిల్లీ ప్రయాణాన్ని వివరించమన్నారు. అదికూడా ఇంగ్లీషులో చెప్పలేని దుర్దశ నాది. ఇప్పటికీ యీ దశలో చాలామంది కనిపిస్తారు – ప్రాంతీయ తత్వం అజ్ఞానం చెల్లిపోయే పరిస్థితులతో సరిపెట్టుకుని రోజులు గడిపేస్తూంటారు – అదృష్టవంతులు. ఆ ఇంటర్వ్యూలో నేను పొందిన పరాభవం చెప్పనలవి కాదు. అభ్యాసానికీ, డిగ్రీలకూ సంబంధం లేదని అప్పుడే అర్ధం చేసుకున్నాను. అది ఒక కసి. తర్వాత ఇంగ్లీషు మీద దండయాత్ర చేసి దాన్ని వశం చేసుకున్నాను. ఇంగ్లీషులో ఉపన్యాసాలే కాదు. పద్యాలు కూడా అనర్గళంగా రాశాను.

***ఒక పరాజయం దాన్ని గుర్తుపడితే మరో విజయానికి తప్పనిసరిగా పునాదులు వేస్తుంది.***

ఏమయినా నా చేత మాట్లాడించలేక, ఓడిపోయి "మీరు ఉద్యోగం కోసం నా యింటికి వచ్చారు కదా?" అనడిగారు శాండిల్యగారు.

ఇదేమిటి ఈ అమాయక బ్రాహ్మడు అందరి ముందూ గుట్టు విప్పేస్తాడు అనుకున్నాను. కుల, మత, వర్గ పక్షపాతాలను మనస్సుదాకానయినా పోనివ్వని ఆరోగ్యకరమయిన దినాలవి. ఉదాత్తమయిన వ్యక్తులు వారు. ఏమయితేనేం, నాకు ఉద్యోగం (యు.డి.సి) యివ్వాలనిపించినా యివ్వడానికి ఏ అర్హతా చూపించలేని భయంకరమయిన ఇంటర్వ్యూ అది. కాని, నెలల తర్వాత అప్పటికి నేను విజయవాడ వచ్చేశాను – నాకు ఉద్యోగం వచ్చినట్టు మా చిన్నాయనగారు ఉత్తరం రాశారు. అది నాకు పెద్ద షాక్. నా అసమర్థతని క్షమించి ఉద్యోగం యిచ్చిన ఔదార్యం శాండిల్యగారిది. అయితే అప్పటికి నా జీవితం వేరే మర్గాన్ని నా మనస్సుకి దగ్గరయిన మార్గాన్ని పట్టింది. కనుక ఉద్యోగానికి వెళ్ళలేదు.

జీవితంలో పూర్తిగా క్రుంగిపోయిన సందర్భం – ఉద్యోగం కోసమని మా చిన్నాయన నన్ను మిలటరీ ఆఫీసుకి తీసుకువెళ్ళడం. 30 మైళ్ళు పైగా మిలటరీ లారీలో ప్రయాణం చేసిన గుర్తు. వెళ్ళి వెళ్ళి నన్ను మిలటరీ ప్రెస్సులో కంపోజింగ్ డిపార్టుమెంట్‌లో నిలబెట్టాడు. నా పని అక్షరాలు కంపోజ్ చేయడం. నా చదువు, నా డిగ్రీ, నా లక్ష్యం, నేను కోరుకునే వ్యాసంగం ఏమిటి? మిలటరీ ప్రెస్సులో కంపోజింగ్ ఉద్యోగం ఏమిటి? కళ్ళనీళ్ళు తిరిగాయి. ఆవేశం తోసుకొచ్చింది. మనస్సు ఎదురు తిరిగింది. ఆ పని చెయ్యనన్నాను. తిరుగు లారీలోనే ఇంటికి వచ్చేసిన గుర్తు. అయితే మరో ఆరునెలల్లో ప్రెస్సులోనే – ఆంధ్రప్రభలో నా ఉద్యోగం ప్రారంభమయింది – కంపోజిటర్‌గా కాదు, సబ్ ఎడిటర్‌గా అయితే ఇది నేను కోరుకున్న జీవితానికి మొదటి పునాదిరాయి.

ఇంతకు ముందు చెప్పినట్టు నేను పురాణం పందెపు గుర్రాన్ని. నా ప్రతిభనీ, నాలో promise ఢిల్లీ ప్రముఖుల ముందు పరిచిన ఘనత పురాణానిది. నార్త్ ఎవెన్యూ ఫ్లాట్‌లో రెండు పెద్ద సమావేశాలు నా కోసమే ఏర్పాటు చేశారు. ఒకటి 'చీకటిలో చీలికలు' నవలలో కొన్ని అధ్యాయాలు చదవడానికి. కపిల కాశీపతి, బొమ్మిరెడ్డిపల్లి, పతంజలి, ఏల్చూరి, పన్యాల, దీక్ష రామగోపాల్ – అంతా ఉన్నారు. చదివాక బహుశా బొమ్మిరెడ్డిపల్లి సూర్యారవుగారనుకొంటాను – బుచ్చిబాబుగారి ఛాయలున్నాయన్నారు. అది నిజమే. ఆ విషయం నా మనస్సుకి తెలుసు. కాశీపతిగారికి కోపం వచ్చింది. పోలికలు అనవసరం అన్నారు. ఏమయినా ఉన్నమాట నేనూ ఒప్పుకున్నాను. ఒక రచయిత లేదా ఒక బాణీ ప్రభావం తప్పుకాదు. అతన్ని కాపీ కొట్టడం తప్పు. కొట్టి నాదని బుకాయించడం తప్పు. ఒక ప్రభావం నుంచి మరొకరు 'ఊపిరి' సవరించుకోవడానికి కాకపోతే యింత సాహితీ సంసారం ఎందుకు? మరోసారి 'రాగరాగిణి' నాటకం చదివాను. అందరికీ మారుతిరావు రాబోయే కాలంలో మంచి సాహితీపరుడవుతాడన్న నమ్మకం. ఆకారణంగా చిన్న గౌరవాన్ని

చూపేవారు. నార్త్ ఎవెన్యూ నుంచి నడిచి వస్తే రాష్ట్రపతి భవనం నుంచి పార్లమెంట్ స్ట్రీట్ ద్వారా ఆకాశవాణికి పదినిముషాల నడక. వార్తల్లో పన్యాల గొంతునో, సూరంపూడి గొంతునో విని – ఓ ఉదయం పురాణం, నేనూ రేడియో స్టేషన్‌కి పరిగెత్తాం. బాతాఖానీ, టీలూ అన్నీ అయాక మనసారా కబుర్లు చెప్పుకుని ఏ పన్నెండుకో ఇల్లు చేరాం. తలుపులు తీయగానే నల్లటి పొరలేవో యిల్లంతా ఎగురుతున్నాయి. భరించలేని కమురు వాసన. ఇద్దరికీ అర్థంకాలేదు. కాస్సేపటికి గుర్తొచ్చింది. స్టౌమీద పాలు ఉంచేసి అలాగే వెళ్ళిపోయామని. పాలు కాగి, మాడి, సెగలై, పొరల్లాగా తేలి గాలిలో ఎగురుతున్నాయి. పాలగిన్నె నల్లగా మారి ఇనుపచిప్పలాగ తయారైంది. వేదకుమారికి తెలియకుండా మొదట ఆ గిన్నెని మాయం చేశాం. ఆ రోజుల్లో సాహితీ చర్చలు జరుపుతూ చపాతీ, కూర చేసుకోవడం అలవాటయింది. అయితే ఆ అలవాటుని అవసరం చేసుకోవలసిన పరిస్థితి మా ఆవిడ ఏనాడూ నాకు కల్పించలేదు. ఒకసారి విశ్వనాధ సాహిత్యం మీద గోష్ఠి జరిగింది. కపిల, పురాణం వ్యాసాన్ని సిద్ధం చేస్తూ మొదటిసారిగా విశ్వనాధ వైరస్‌ని నా రక్తంలోకి ఎక్కించారు. ఆ రోజుల్లో విశ్వనాధగారబ్బాయి శ్రీకృష్ణదేవరాయలు రేడియోలో ఢిల్లీలో పనిచేస్తున్నారు. ఆ గోష్ఠికి ఆయనా హాజరయారు.

కె.వి గోపాలస్వామిగారు 'నాట్యకళ' అని ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ పత్రిక నిర్వహిస్తున్న నాటిక రచనా పోటీలో నన్ను పాల్గొనమన్నారు. ఆ పత్రికకి శ్రీనివాస చక్రవర్తి సంపాదకుడు. 'పతిత' అనే నాటిక పంపాను. ఏ విధంగా చూసినా 'పతిత' గొప్ప రచనేం కాదు. అయితే మిగతా రచనలు అంతకన్నా నాసిగా ఉన్నాయేమో నాకు ఉత్తమ రచన బహుమతి వచ్చింది. ఆ రోజుల్లో ఇది రెండవ పురస్కారం.

ఒకసారి నేనూ, సూరంపూడి సీతారాం, పురాణం బస్సులో వెళ్తున్నాం. 'ఇప్పుడేం రాయడంలేదా' అని యధాలాపంగా అడిగాను సీతారాంగారిని. ఆయన పెదవి విరిచి 'ఏమిటో, యిప్పుడేం రాయాలనిపించదండీ' అన్నారు. నేను షాక్ అయాను. తీసే ఊపిరీ, విడిచే ఊపిరీ సాహిత్యంగా గడిచే, గడవాలని నమ్మే దశలో ఉన్న నాకు, పేరున్న ఓ రచయిత ఏమీ రాయాలనిపించదు – అంటారేమిటి? ఇది సాధ్యమా? అని విస్తుపోయాను.

సంవత్సరాలు గడిచి, అనుభవం పోగయాక – రాసే రాశి కాక, వాసి మీదకి మనస్సు పోతుందనీ, రాయాలనిపించే విషయాల్ని మనస్సు నిర్దాక్షిణ్యంగా వడబోస్తుందనీ ఒకప్పుడు రాయనక్కరలేదనే దశకూడా రావచ్చుననే అవగాహన – యిప్పుడిప్పటిది. దానికి మూడు రకాలయిన కారణాలు ఒకటి వయస్సు యిచ్చే నైరాశ్యం, రెండు సమాజం కలిగించే నిరాశ్యం, మూడు తన కలం మీద తనకి నమ్మకం పోవడం. ఏమయినా ఈ మూడు దురదృష్టకరమయినవేనని యిప్పటికీ భావిస్తాను. వయస్సు అనుభవం జీవితాన్ని కాచి వడబోసి తూకంగా అనుభూతుల్ని ఆవిష్కరించే ఆయుధాల్ని

పదును చేస్తుంది. వాటిని ఆ దశలో అటకెక్కించడం అన్యాయమని నా నమ్మకం. నిజానికి వృద్ధాప్యంలో నిగ్గు తేలిన సారాన్ని కలం వెలువరిస్తుందని నా భావన.

తర్వాత నేను హైదరాబాదు రేడియోలో పనిచేస్తున్నప్పుడు సీతారాంగారు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో రీజనల్ ఆఫీసరుగా వచ్చి అక్కడే రిటైరయారు.

ఒకసారి పార్లమెంట్ భవనంలో నార్ల వెంకటేశ్వరరావుగారిని కలిశాను. అప్పటికే ఆంధ్రప్రభ యాజమాన్యంతో నార్లవారికి ఏదో అభిప్రాయ భేదాలు రావడం, సిబ్బందితో సమస్యలు కారణంగా మద్రాసులో ఆంధ్రప్రభ ఆఫీసులు మూతపడడం జరిగింది. నార్లవారు అందులోంచి బయటికి వచ్చేశారు. ఆపద్ధర్మంగా చిన్నసైజు పత్రిక విజయవాడ నుంచి వచ్చేది – వి.డి.ప్రసాదరావుగారి సంపాదకత్వంలో. పార్లమెంట్‌లో నార్లవారిని కలిసినప్పుడు నాతో తలశిల రామచంద్రరావు, వాడ్రేవు పతంజలి ఉన్నారు. నార్లవారు చైన్ స్మోకర్. అందరికీ సిగరెట్టు చూపించి, నా దాకా వచ్చేసరికి, నాకూ యివ్వబోయి 'మీరు చిన్నవారు' అని తను సిగరెట్టు అందుకున్నారు. రామచంద్రరావుగారు నన్ను పరిచయం చేశారు. అప్పటికే వారపత్రికలో నా 'అనురాగాలు – అంతఃకరణాలు', 'ఇంద్రధనస్సు' అనే రెండు చిన్న సీరియల్స్ వచ్చాయి. కనుక నాపేరు వినగానే కళ్ళు పెద్దవి చేసి 'మీరా!' అంటారనుకున్నాను. కాని, ఆయన అనకపోగా ఆ పేరే విననట్టు ముఖం పెట్టారు. (తరువాత నాకర్థమయింది – పత్రికకి సంపాదకుని పేరు ఉన్నా వారపత్రికని నిర్వహించేది వేరుగా ఉంటారని)

అప్పుడు చెప్పాను  నేను రచయితననీ, యాజమాన్యంతో నార్లవారికి తగాదా ఉన్న కారణంగానే నేను ఆంధ్రప్రభలో చేరడానికి యిష్టపడలేదనీ అది వారి ముఖస్తుతి కోసం అన్నమాట కాదు. నిజం కూడా. ఆయన కళ్ళు విప్పారి చూసి 'నా అభిప్రాయ భేదాలకీ మీకూ సంబంధం ఏమిటి? వెళ్ళి చేరండి. ఇప్పుడు  నీలంరాజు వెంకట శేషయ్యగారున్నారు – ఉత్తరం యిస్తాను' అన్నారు.

అది మళ్ళీ మరొక మలుపు. మా నాన్నగారికి ఉత్తరం రాస్తే ఆయన తెన్నేటి విశ్వనాధంగారిచేత శేషయ్యగారికి ఉత్తరం రాయించి పంపించారు. మరో రెండు ఉత్తరాలు – కపిల కాశీపతిగారిదీ, పురిపండాదీ పట్టుకుని విజయవాడ బయలుదేరాను. మా చిన్నాన్నగారికి నేను ఢిల్లీ వదిలి వెళ్ళడం సుతరామూ యిష్టంలేదు. మా నాన్నగారికి యిలా యిల్లు వదిలి తిరగడం నచ్చలేదు. ఇంటికి వచ్చెయ్యమని పెద్ద ఉత్తరం రాశారు. నన్ను ఆపాలనే మా చిన్నాన్నగారి ప్రయత్నానికి అదొక పెద్ద ఆయుధం అయింది. ఆ క్షణాల్లో విజయవాడ వెళ్ళాలని నేను తీసుకున్న నిర్ణయానికి ఎవరి మద్దతూ లేదు. అయినా మనసులో ఏదో ధైర్యం. నేనేం చెయ్యాలో నాకు తెలిసిన మొండిపట్టుదల.

పత్రికలో పనిచేస్తే రచనలు విరివిగా వ్రాయవచ్చు. వ్రాసినవన్నీ ప్రచురితమవుతుంటాయి. ఇది అనూహ్యమయిన కల. ఆ కల నిజం చేసే నాలుగు ఉత్తరాలు నా జేబులో ఉన్నాయి. ఇక నన్నెవరు ఆపగలరు? బహుశా నా పక్క 'విధి' అనే పెద్ద శక్తి దన్నుగా నిలబడిందనుకుంటాను. ఇంతమందిని ఎదిరించి రైలెక్కినా ఆనాడు నా మనస్సులో ఏ మూలో చిన్న వణుకు ఉంది. తీరా వెళ్ళాక ఏమవుతుంది? ఉద్యోగం రాకపోతే? రాకపోతే కనీసం యింటికి దగ్గరగా ఉంటాను. తిరిగి రమ్మన్న మా నాన్నగారి ఆహ్వానం ఉండనే ఉంది. ఇది దూకుడుగా తీసుకున్న నిర్ణయం అనిపించలేదు నా మట్టుకు.

రైలు అద్భుతమయిన భవిష్యత్తు వేపుకు దూసుకుపోయింది.

విజయవాడలో నాకు ఇద్దరు మాత్రమే తెలుసు. నాచేత రాగరాగిణి నాటకం వ్రాయించిన ర.స.న. సమాఖ్య, వెంకటేశ్వరరావు, నా మొదటి నాటికని ప్రచురించిన నవోదయా పబ్లిషర్స్ మేనేజరు పి.యస్.ప్రకాశరావు. రసన సమాఖ్య విజయవాడలో పూర్ణానందం సత్రంలో ఉండేది. పక్కగది ప్రఖ్య శ్రీరామమూర్తి, శివంగార్ల నవ్య కళా సమితిది. రసన సమాఖ్య గదిలో నా మకాం. అప్పుడు సమాఖ్య కార్యదర్శి జియస్సార్ మూర్తిగారు. సత్రం మెట్లు దిగి ఎడమవేపు మలుపు తిరిగితే శాంతికేఫ్. గాంధీనగర్‌లో శాంతికేఫ్ మేడమీద స్నానం. శాంతికేఫ్‌లోనే భోజనం. ఉదయమే సబ్బూ, తువాలూ పట్టుకుని హోటల్‌కి వచ్చి స్నానం చేసి రసనకి చేరేవాడిని. శాంతి కేఫ్ ప్రొప్రయిటర్ ముఖ్యప్రాణరావు ఉడిపి బ్రాహ్మణుడు. నాటక ప్రియుడు. ముఖ్యంగా వెంకటేశ్వరరావు అభిమాని. కనక హోటల్ సిబ్బందితో పాటు స్నానానికి నాకా సౌకర్యాన్నిచ్చాడు.

విజయవాడలో దిగుతూనే పురాణం సోదరుడు సూర్యప్రకాశరావుగారి ఇంటికి వెళ్ళాను. అక్కడే పురాణం తల్లితండ్రుల్ని కలిశాను. భోజనం అక్కడ. (ముందు ముందు తెలిసిన విషయం – పురాణం తల్లిగారు, వారి చిన్నతనంలో దశికవారి జగన్నాథపురంలో కలిసి ఆడుకున్న ఓ స్నేహితురాలి కూతురు నా భార్య అయింది)జీవితం ఊహించని మెలికలు తిప్పుతుంది. పురాణం సూర్యప్రకాశరావు రచయిత. మనిషి నిలకడ, నెమ్మది. అన్నగారి మాటమీద నిలిచే లక్ష్మణుడు. ఆయనతో కలిసి వి.డి. ప్రసాదరావుగారిని, నీలంరాజు వెంకట శేషయ్యగారిని కలిశాను. నేను తెచ్చిన నాలుగు ఉత్తరాలూ చూసి, నన్ను అమాంతం కావలించుకుని 'ఎప్పుడు ఉద్యోగంలో చేరతారు?' అని శేషయ్యగారు అడుగుతారని నా ఉద్దేశం. శేషయ్యగారు చాలా నిదానమయిన మనిషి. నిండుకుండ. అమితమయిన సరళస్వభావులు. శ్రోత్రియులు. ఉదయమే యోగాసనాలు వేసేవారు. ఎప్పుడూ మర్యాదగా, మన్ననగా పలకరించేవారు. తరువాత తెలిసింది వారు ఏనాడో సినిమాలో హీరోగా నటించారని, ఆడవేషాలు కూడా వేశారని. ఏమయినా కాస్సేపు ఆలోచించి '15 రోజుల తరువాత కనిపించండి' అన్నారు.

'అంటే ఎప్పుడూ రమ్మంటారు?' అన్నాను. నా ఆత్రుత వారికేం తెలుసు.

కాలెండరు చూసి '25న'.

'ఎన్నిగంటలకి?'

'ఇదే టైముకి.'

ఏ పనయినా మరిచిపోయేవాడినికాని 25వతేదీ ఉదయం 8గంటలు మరిచిపోయేవాడిని కాను. 7.58కి ఆయన ఇంటిముందు, 8గంటలకి ఆయన సమక్షంలో నన్ను చూసి – నన్ను రమ్మన్న విషయం మరిచిపోయి కాస్త ఖంగుతిన్నారనుకుంటాను. కాస్సేపాలోచించి 'బుధవారం కనిపించండి' అనేశారు.

'ఎన్నిగంటలకి?'

'ఇదే టైముకి.'

మరోమాటలేదు. వెళ్ళిపోయను. బుధవారం ఎనిమిది గంటలకి ఆయన వాచీ సరిచేసుకోవలసిందే, నేను ఆయన ముందు నిలబడ్డాను.

ఇటుపక్క చాలా విషయాలు జరిగిపోయాయి. నేను విజయవాడ చేరిన రెండోరోజునే నా జేబులో డబ్బుపోయింది. పెద్ద మొత్తం కాదు. కాని అక్కడ నాకున్నదల్లా ఆ సొమ్మే. ఎవరికి చెప్పను?

అప్పటికి నవోదయా ప్రకాశరావుగారు నేనంతవరకూ రాసిన 'చీకటిలో చీలికలు' నవలని విన్నారు. చాలా థ్రిల్ అయ్యారు. నా 'అనురాగాలూ – అంతఃకరణాలూ', 'ఇంద్రధనస్సు' ప్రింటింగు జరుగుతోంది. నా పైకం పోయిన సంగతి విని నాకు ఆయనే నెలసరి హోటల్ భోజనం టిక్కెట్లు తెప్పించారు. గవర్నర్ పేటలో ఓ టైర్ల కంపెనీ వెనుక ఓ గదిని కుదిర్చారు. కాంప్‌కాట్ నాన్నగారు పంపారు. టైర్ల సువాసనల మధ్య ఓ సాహితీపరుడి జీవితం విజయవాడలో అలా ప్రారంభమయింది. ఆ రోజుల్లో అయిదారు రూపాయలిచ్చి ఓ మడత కుర్చీ కొన్నారు ప్రకాశరావుగారు. నాకు పెళ్ళయి, పిల్లలు పుట్టి, వాళ్ళు పెద్దవాళ్ళయ్యేవరకు అది నా దగ్గర వాడుకలో ఉండేది. నాతో ఊళ్ళన్నీ తిరిగింది. చాలా రచనలు అందులో కూర్చునే రాశాను. సంవత్సరాల తరబడి, దాని సుఖాన్ని నేను మరిగాను. నా సాహితీ వ్యాసంగాన్ని కుర్చీ మరిగింది. ఎప్పుడు దూరమయిందో గుర్తులేదు. మా పిల్లలు పెద్దవాళ్ళయే నాటికి ఆ పడక కుర్చీలేదు. ఆ తర్వాత మరెప్పుడూ మా యింట్లోకి పడక కుర్చీ రాలేదు. వయసు మళ్ళాక నరసరావుపేట కుర్చీ కొనుక్కుని – రెండు కాళ్ళూ కుర్చీ చేతుల మీద జాపుకు కూచోవాలని సరదా. కాని కుర్చీ రాలేదు. కొన్ని చిన్న కోరికలే. ఏవో కారణాలకి మూలన పడతాయి. రోజూ నవోదయాలోనే గడిపేవాడిని. అప్పుడక్కడ మరొకాయన పనిచేసేవారు. ఆయన రామమోహనరావుగారు. ఇద్దరూ ఒక్కచోటే మొగల్రాజపురంలో ఉండేవారు. అప్పుడప్పుడు వారితో ఇళ్ళకి వెళ్ళి భోజనం చేసేవాడిని. మంచి మిత్రులు.

ఇద్దరికీ గొప్ప వ్యాపార దక్షతా సయోధ్యా ఉండేది ఆ రోజుల్లో. అప్పుడేమిటి? ఇప్పుడూ పుస్తక ప్రచురణకి విజయవాడే కూడలి. నాలుగు దశాబ్దాల పాటు అభిరుచితో పుస్తక ప్రచురణలు జరిపి రామమోహనరావుగారు అందరికీ సాహితీ బంధువయారు. నా 'రాగరాగిణి' నాటకాన్ని ఒకటి రెండు ప్రచురణలు తెచ్చారు అలాగే "అనంతం, మరో రెండు నాటికలు" పుస్తకం కూడా నవోదయాలోనే రెండుసార్లు ప్రచురితమయింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments